క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి

మామిడికుదురు: ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలతో పాటు ట్రైబల్ స్కూళ్లలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మామిడికుదురు మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ మామిడికుదురు ఎమ్మార్సీలో మంగళవారం జరిగింది. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు బి.నాగేంద్రప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రెండు నెలలు పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలను అధ్యయనం చేశానన్నారు. దీనిపై త్వరలో విద్యాశాఖ మంత్రికి నివేదిక సమర్పిస్తానన్నారు. సభలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు బేతినీడి శ్రీనివాస్, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి



పనలపై ఉన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ మృదుల

మామిడికుదురు: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.మృదుల సూచించారు. లూటుకుర్రులో ఆమె పర్యటించారు. పనలపై ఉన్న పంటను పరిశీలించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను మెషీన్ల ద్వారా కోత కోసుకోవాలని, చేతి కోతలను మాత్రం వాయిదా వేసుకోవాలన్నారు. పనలపై ఉన్న పంటను కుప్పలు వేసే సమయంలో పూర్తిగా ఆరని పక్షంలో ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పలు వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించవచ్చన్నారు. కోత కోసి పొలంలో పనలపై ఉన్న పంట మొలకెత్తకుండా ఉండేందుకు అయిదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడే విధంగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొలంలో నీరు నిలిచిన పక్షంలో పనలను గట్లపైకి తెచ్చుకుని విడగొట్టి ఉప్పు ద్రావణాన్ని చల్లుకోవాలన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఓ సూచించారు.

సేవలందించే వారికి ఎల్లవేళలా గుర్తింపు



అంబాజీపేటలో రత్నకుమారిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు చిరునవ్వుతో సేవలందించే వారికి ఎల్లవేళలా ప్రజల నుంచి గుర్తింపు ఉంటుందని వైద్యాధికారులు వి.గౌతమి, కేఎస్ శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో పీహెచ్ఎన్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన కె.రత్నకుమారి సన్మాన సభను సీహెచ్ఓ బి.అప్పారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ రత్నకుమారి పీహెచ్ఎన్ నుంచి సీహెచ్‌వోగా పదోన్నతి పొంది ద్వారపూడి బదిలీపై వెళుతున్నారన్నారు. రత్నకుమారిని వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

అంబాజీపేట: దాళ్వా వరి పంటలో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన నారుమడి వస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీ రాజశేఖర్, పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేబీ రామ్మోహనరావులు రైతులకు వివరించారు. ఇరుసుమండలో ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ అధ్యక్షతన విత్తన ఉత్పత్తి పథకంపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ భాస్వరం ఎరువును దమ్ములో వేసుకోవడం వల్ల వరి దుబ్బులు బాగా వస్తాయన్నారు. వరి నాట్లు వేసుకునే ముందు దమ్ములో భాస్వరం, పొటాష్ ఎరువులను తగిన మోతాదులో వేసుకోవాలని రైతులకు సూచించారు. వరి నాట్లు వేసుకున్న తర్వాత రెండో దఫా ఎరువులను వేయాలన్నారు. దీనివల్ల వరి నాట్లు చేసిన 30 రోజుల వరకు తెగుళ్లను తట్టుకునే శక్తి ఉంటుందని వివరించారు. వరి పంట కోత అనంతరం విత్తనాల నిల్వ, తేమ 14 శాతం వచ్చే వరకు ఆరబెట్టాలన్నారు. అనంతరం వచ్చే పంటకు విత్తనాలుగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, రైతులు దొమ్మేటి రాధాసూర్యనారాయణ, కడలి సత్యనారాయణ, మామిడిశెట్టి బలరామకృష్ణ, దంతులూరి వెంకట సత్యనారాయణరాజు, మోకాటి గోపి పాల్గొన్నారు.

గంగపుత్రులకు ఆటుపోట్లు



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో బోటు నుంచి వేటాడిన చేపలను తీస్తున్న మత్స్యకారులు



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ సమీపంలో నిలిపిన బోట్లు

- వేట విరామ పరిహారానికి మత్స్యకారుల నిరీక్షణ
- ఆరు నెలలుగా నెరవేరని హామీ

సఖినేటిపల్లి: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే భరోసా సొమ్మును వెంటనే విడుదల చేయాలని మత్స్యకారులు కూటమి ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. జీవనభృతి పెంచి ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు గడుస్తున్నా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతూ వారి ఉపాధికి గండి కొడుతుంటే, మరో వైపు ఇప్పటికీ జీవన భృతి అందక మత్స్యకారులు ఆటు, పోట్లు నడుమ జీవనం సాగిస్తున్నారు.

హామీ అమలయ్యేనా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేటకు వెళ్లే ప్రతి మత్స్యకార కుటుంబానికి ఇచ్చే రూ.10 వేల పరిహారాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చారు. తీరా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావస్తున్నా కూడా ఇవ్వలేదని మత్స్యకారులు వాపోతున్నారు.

వేట నిషేధ కాలం..

ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ అర్ధరాత్రి వరకు సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తున్నారు. ఈ సమయంలో సముద్రంలో చేపలు గుడ్లు పెట్టి పొదగడం ద్వారా మత్స్య సంపద వృద్ధి చెందుతుందని గుర్తించి వేట నిషేధం అమలు చేయడం పరిపాటిగా మారింది. ఈ సమయంలో మత్స్యకారులు ఎవరూ సముంద్రలోకి వెళ్లి వేట సాగించేందుకు వీలుకాదు.

రాజోలు దీవిలో..

రాజోలు దీవిలో విస్తరించి ఉన్న తీరంలోని వివిధ గ్రామాల్లో సముద్రం వేటపై ఆధారపడి ఎక్కువ మంది జీవనం సాగిస్తున్నారు.

అంతర్వేది, పల్లిపాలెం, గొంది, రామరాజులంక, రాజోలు, కరవాక, గోగన్నమఠం తదితర గ్రామాల్లో మత్స్యకారులకు నిత్యం బోటుపై సముద్రంలోకి వెళ్లి వేటాడితే తప్ప రోజు గడవని పరిస్థితి. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో 1380 మంది మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో కూటమి పెంచిన రెట్టింపు ఆర్థికసాయం రూ.20 వేలు చొప్పున వారికి అందాల్సి ఉంది.

గత సర్కార్ భృతి చెల్లింపులు ఇలా..

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సముద్రంపై చేపల వేట నిషేధ కాలంలో అర్హత గల మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచారు. ఏటా మే 15వ తేదీ నాటికి డీబీటీ ద్వారా ప్రభుత్వం వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసేది. నిషేధ సమయంలోనే ఇవ్వాల్సిన పరిహారాన్ని గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వం ఇవ్వని రీతిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి ఇచ్చింది.

ప్రభుత్వానికి జాబితా అందజేశాం

తమ పరిధిలోని వేట విరామం లబ్ధిదారుల జాబితా అన్ని వివరాలతో ప్రభుత్వానికి అందజేశాం. ప్రభుత్వం వద్ద లిస్ట్ పెండింగ్‌లో ఉంది. త్వరలోనే జీవనభృతి అందజేస్తాం.

– సిద్ధార్థవర్ధన్, ఫిషరీస్, ఏడీ, రాజోలు

నిషేధ సాయం వెంటనే ఇవ్వాలి

చేపల వేట నిషేధంలో ఉపాధి కోల్పోయిన తమకు సాయం వెంటనే ఇవ్వాలి. గత ప్రభుత్వంలో సకాలంలో అందిన ఆర్థిక సాయం ఎంతో ఆసరగా ఉండేది. పెంచి ఇస్తామన్న హామీ నెరవేర్చాలి.

– బొమ్మిడి శేషారావు, పల్లిపాలెం

సకాలంలో అందక ఇబ్బందులు

ఈ దఫా వేట నిషేధ సమయంలోనే భృతి సకాలంతో అందక ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ముందుగా భృతి అందింది. ప్రకృతి వైపరీత్యాలతో ఉపాధి కోల్పోయాం.

– మల్లాడి పెంటయ్య, పల్లిపాలెం

మాజీ మంత్రి గొల్లపల్లికి సత్కారం



మలికిపురం పార్టీ కార్యాలయంలో గొల్లపల్లిని సత్కరిస్తున్న దళిత పెద్దలు

మలికిపురం: గుంటూరులో నిర్వహించిన మాలల సింహగర్జన సదస్సుకు తరలివెళ్లిన మాలలకు తగిన విధంగా ప్రోత్సహించి, సహకరించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు, దళిత పెద్దలు చిరు సత్కారం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వారంతా ఆయనను సత్కరించారు. భూపతి వెంకటపతి, నల్లి శ్రీనివాస్, బొంతు మునిరాజు, కుసుమ శ్రీహర్ష, మెడబల రాజ్‌కుమార్, మట్టా సత్తిబాబు, ఉండ్రు జాన్, కే సతీష్, తాడి సహదేవ్, కే బాలకృష్ణ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

రాజోలు: చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కొత్తపేట డీఎస్పీ గోవిందరావు అన్నారు. మంగళవారం తాటిపాకలో డ్రగ్స్ నివారణ, యాంటీ ర్యాగింగ్ అంశాలపై వేద కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ గోవిందరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్ నివారించేందుకు పలు సూచనలు చేశారు. డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉందని, ముఖ్యంగా యువత గంజాయి, మత్తు పదార్థాలు సేవించినట్టు గుర్తిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్లో ప్రవర్తనలు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వేద కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్సై బి.రాజేష్‌కుమార్, సఖినేటిపల్లి ఎస్సై దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలే లక్ష్యంగా ప్రణాళిక



మామిడికుదురు శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: ఆరోగ్యవంతమైన గ్రామాలే లక్ష్యంగా ముందుకు వెళ్దామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రధానంగా తొమ్మిది అంశాలపై సమావేశంలో చర్చించారు. పేదరిక నిర్మూలన, సంపూర్ణ పారిశుద్ధ్యం, గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై ఉద్యోగులు ప్రధానంగా దృష్టి సారించి విజన్–2047 లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, ప్రజలకు కల్పించాల్సిన సదుపాయాలు, వారి సమస్యలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) 2025–26 ప్రణాళికలో భాగంగా ఇచ్చే శిక్షణతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన ఆర్‌జీఎస్‌ఏ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఎంపీడీవో మాట్లాడుతూ రెండు రోజుల పాటు 9 థీమ్స్‌పై శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అంతకు ముందు గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించి శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలమూరులో..

అలమూరు: సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామ పంచాయతీలు అన్ని రంగాల్లో పురోగమించాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. ఆలమూరులోని స్త్రీశక్తి భవనంలో ఎంపీడీఓ ఎ.రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్య అభియాన్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన ప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్ధికి ఐక్యరాజ్యసమితి సూచించిన తొమ్మిది అంశాలను సమగ్రంగా వివరించారు. క్షేత్రస్థాయిలో గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. పరిపాలన అధికారి ఎం.మెహెర్ ప్రకాష్, ఏపీఓ జి.అరుణకుమారి, ఏపీఎం ఎం.ధనరాజు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, ఎంపీటీసీలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భీమారావు అధ్యక్షతన జరిగింది.

ఎంపీడీపీఓ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీలు చేయాల్సిన పనులను వివరించారు. అనేక అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం టెలికాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరా తదితరులు ఉన్నారు.

రైతు ప్రయోజనాలే పరమావధిగా పని చేయాలి



రాజోలు, పి.గన్నవరం డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులను అభినందిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: రైతు ప్రయోజనాలే ప్రాధాన్యతగా నీటి సంఘాల ప్రతినిధులు పనిచేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. మంగళవారం మలికిపురంలో నీటి సంఘాల డీసీ గన్నవరం అధ్యక్షుడిగా ఎన్నికైన గుబ్బల శ్రీను, రాజోలు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జీనాయుడులను, ఎమ్మెల్యే అభినందించారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, మండల నీటి సంఘాల చైర్మన్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజోలు డీసీ అధ్యక్షుడిగా 'పినిశెట్టి'

రాజోలు: నీటి వినియోగదారుల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా శివకోడు గ్రామానికి చెందిన పినిశెట్టి వెంకటస్వామి(బుజ్జి) ఎన్నికయ్యారు. మంగళవారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. రాజోలు, మలికిపురం, లక్కవరం, రామరాజులంక, సఖినేటిపల్లి, గొంది, అంతర్వేది నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షులంతా ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. గొంది నీటి సంఘం అధ్యక్షుడు ఆకన బాబ్జి రాజోలు డీసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాజోలు డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు తహసీల్దార్ ధృవీకరణపత్రాన్ని అందజేశారు.

ఆలమూరు డీసీగా గోపాలస్వామి

ఆలమూరు: ఆలమూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా చొప్పెల్లకు చెందిన మెర్ల గోపాలస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. దీంతో మడికి, ఆలమూరు, చింతలూరు సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చొప్పెల్ల సాగునీటి సంఘం అధ్యక్షుడు గోపాలస్వామిని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గాను, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజును వైస్ చైర్మన్‌గాను సహచర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజయం దిశగా అడుగులు వేయాలి



రాజోలులో కిక్ బాక్సింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు విజయం దిశగా అడుగులు వేయాలని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. మంగళవారం కళాశాలలో ఆది కవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కొలిగేట్ టోర్నమెంట్ కిక్ బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. యూనివర్సిటీ పరిధిలోని సుమారు 12 కళాశాలలకు చెందిన సుమారు 50 మంది క్రీడాకారులు కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తామని విజేతలుగా నిలిచిన క్రీడాకారులు అంతర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత పొందుతారన్నారు. ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ గతంలో కళాశాలలో బాక్సింగ్ పోటీలకు వేదికగా నిలిచిందన్నారు. ప్రస్తుతం కిక్ బాక్సింగ్ పోటీలు జరగడం శుభపరిణామమని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, ఆర్గనైజర్ బి.మధుకుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఖండ్రిగ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పి.శ్రీకర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మంగళవారం మండలంలోని ఖండ్రిగ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎమ్మెల్యే బండారు, ఆర్డీవో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భూములు ఎక్కువ తక్కువలు లేదా వివిధ సమస్యలకు ఎదురైతే వాటిని పరిష్కరించడం కోసం ప్రభుత్వం ఈ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. భూ సమస్యలకు సంబంధించి పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఈ సదస్సులో మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, అవిడి నీటి సంఘం అధ్యక్షుడు రెడ్డి తాతాజీ, పలువురు స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు, ఎస్.పెదపాలెం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డీటీ డి.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా ఈ సదస్సుకు హాజరయ్యారు. డీటీ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం 8 మంది అర్జీలు చేసుకోగా అందులో అండగల్ కరెక్షన్ మూడు, మ్యుటేషన్ కోసం రెండు, సర్వే కోసం మూడు అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎంఎస్ రాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: రెవెన్యూ సదస్సుల వల్ల రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని సర్పంచ్ అడబాల తాతకాపు పేర్కొన్నారు. లూటుకుర్రు గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఎమ్మార్వో వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ రాజు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి బుచ్చిరాజు అన్నారు. మంగళవారం పొదలాడ పంచాయతీ రెవెన్యూ సదస్సు జరిగింది. తొలుత డీఎల్‌పీఓ బుచ్చిరాజు ఆధ్వర్యంలో పంచాయతీ నుంచి స్థానిక కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో డీఎల్‌పీఓ బుచ్చిరాజు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. రెవెన్యూ సమస్యలే కాకుండా రేషన్ కార్డు, హౌసింగ్, పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పొదలాడలో జరిగిన సదస్సులో సుమారు 125 దరఖాస్తులు వచ్చాయని వీఆర్వో ఎ.గంగాధర్ తెలిపారు. డీటీ పీఎస్ రాజు, సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రజని తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: అడంగల్, ఆన్‌లైన్‌లో తప్పులు, భూ వివాదాలు వంటి సమస్యలకు అర్జీలు చేసుకుంటే వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తారని మండల ప్రత్యేకాధికారి, డాక్టర్ కోనసీమ జిల్లా హార్టీకల్చర్ జేడీ బీవీ రమణ అన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. జేడీ రమణ మాట్లాడుతూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న 33 రోజుల్లో భూ వివాదాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సభల్లో 17 అర్జీలు అందయని తహసీల్దార్ వెంకటేశ్వరి తెలిపారు. పాస్ పుస్తకాలు, అడంగల్‌లో తప్పులు సరి చేయాలంటూ రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. సభలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు సంకష్టహర చతుర్థి పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ పూజలు స్వామికి ప్రీతికరమని ఈఓ తెలిపారు. ఈ పూజలు తెల్లవారుజామున ఆరు గంటల నుంచి ప్రారంభమవుతాయని ఈఓ తెలిపారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వైభవంగా లక్షతులసి పూజ

అంబాజీపేట: ధనుర్మాసంలో భాగంగా అంబాజీపేట పెద్దవీధిలో వేంచేసిన సీతారామచంద్ర స్వామికి మంగళవారం లక్షతులసి పూజ నిర్వహించారు. స్థానిక భక్తులు ఎర్రాప్రగడ సూర్యప్రకాష్ సోదరులు సీతారాముల వారికి అభిషేకాలు, లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలను చేశారు. అలాగే హోమాలు పూర్ణాహుతి జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఐదు లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐ కె.కాత్యాయని మంగళవారం తెలిపారు. కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన గొర్రె విజయకుమార్ వద్ద 5 లీటర్ల సారాని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రాజోలు మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రావులపాలెం: శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పేద వలస కూలీలకు ఉచిత మెగా ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సులువైన వ్యాయామం ప్రతిరోజు చేసుకోవడం ద్వారా ఏ విధంగా వివిధ నొప్పుల నుంచి బయటపడవచ్చో ఫిజియోథెరపిస్ట్ మోహిత్, సాయి సీతలు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి అధునాతన పరికరాలతో ఫిజియోథెరపీ సేవలను అందించారు.

ఘనంగా పెన్షనర్స్ డే

రావులపాలెం: మండల పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. పది మంది సీనియర్స్‌కు సన్మానం చేశారు. సీనియర్ పెన్షనర్ భమిడిపాటి శ్రీరామ్ వారికి సన్మానం చేశారు. వేదపండితుల ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, సెక్రటరీ గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.


త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెంలో మంగళవారం ధనుర్మాసం పురస్కరించుకుని మామిడికుదురుకు చెందిన త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు బండారు సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులు వీటిని గ్రామస్తులకు అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ, ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను అందించడంతో పాటు, ప్రచారం చేశామన్నారు. వేదిక సభ్యులు హనుమంతురావు, బ్రహ్మాజీ, సుబ్బారావు, సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా భవానీల కలశాల పూజ

అంబాజీపేట: చిరతపూడి శివారు చిట్టి చెరువుగట్టు వద్ద గురుభవానీలు దంగేటి సాయిబాబు, మాతా భవానీ మల్లేశ్వరి, మట్టపర్తి ఏసు, మట్టపర్తి ప్రసాద్, పప్పుల వీరబాబుల పర్యవేక్షణలో కేతా దొరబాబు గురుభవాని ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 21 కలశాల పూజను నిర్వహించారు. గణపతి హోమం, అమ్మవారికి కుంకుమార్చనపూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అంతకుముందు 21 కళశాలతో స్థానిక వనువులమ్మ, విజయదుర్గమ్మ అలయాల వద్ద నుంచి భవానీల శరణుఘోషతో జలాలను తీసుకు వచ్చి సహస్ర నామాలతో అమ్మవారి కలశాల, కుంకుమార్చన జరిపించారు. ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన నిప్పులగుండంలో భవానీలతో పాటు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భవానీలు స్వీకరించారు.

వృథా సాగునీరు సద్వినియోగం



గుమ్మిలేరులో వృథాగా పోతున్న సాగునీటికి అడ్డుకట్ట వేసి మరో కాలువకు మళ్లిస్తున్న రైతులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో పంట భూముల నుంచి వృథాగా పోతున్న సాగునీటిని ఆ గ్రామానికి చెందిన రైతులు సద్వినియోగం చేసుకుని ఇతర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్థానిక నర్సిపూడి మీడియం డ్రైన్ ద్వారా పంట పొలాలకు సాగునీరు వస్తుంది. అందులో నుంచి వృథాగా పోయే సాగునీరు మురుగు కాలువ (డ్రైన్)కు అడ్డుకట్ట వేసి అదే ప్రాంతంలో ఉన్న చొప్పెల్ల నుంచి వల్లూరు వరకు వెళ్లే పంటకాలకు మళ్లించేందుకు మంగళవారం అడ్డుకట్ట వేశారు. దీంతో ఈ కాలువ ద్వారా సాగు చేసే దాదాపు 600 ఎకరాలకు సాగు నీటికి ఇబ్బందులు లేకుండా పోయింది. వివరాల్లోకి వెళితే చొప్పెల్ల కాలువ దిగువన శివారు పూర్తి స్థాయిలో సాగునీరు అందక దాళ్వా వరి సాగులో నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆ ఇబ్బందులను అధిగమించేందుకు రైతులు స్వచ్ఛందంగా నిధులు సమకూర్చుకుని బరకాలు, ఇసుక బస్తాలతో డ్రైన్‌కు అడ్డుకట్ట వేసి ఈ నీటిని పంటకాలవలోకి మళ్లించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో గుమ్మిలేరు, మండపేట, వల్లూరు గ్రామాలకు పరిధిలోని శివారు ప్రాంతాలకు సైతం రబీ సీజన్‌లో సాగునీరు సరఫరా జరుగుతుంది. ఈ పనులను రైతు ప్రతినిధులు అముజూరి శ్రీనివాస్, యార్లగడ్డ రమేష్ చౌదరి పర్యవేక్షించారు.